




EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
11 మార్చి 2025
పేజీలు: 02




## ‘భద్రకాళి’గా మారిన విజయ్ ఆంటోని ‘పరాశక్తి’

తమిళ నటుడు విజయ్ ఆంటోని నటిస్తున్న ల్యాండ్ మార్క్ 25వ చిత్రాన్ని ఇప్పటికే శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్‌ను గతంలో రిలీజ్ చేశాడు. ఈ చిత్రాన్ని తెలుగులో ‘పరాశక్తి’ అనే టైటిల్‌తో రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించాడు. కానీ, అదే టైటిల్‌తో శివకార్తికేయన్ నెక్స్ట్ మూవీ వస్తుండటంతో, ఇప్పుడు విజయ్ ఆంటోని తన సినిమాకు ‘భద్రకాళి’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశాడు. ఇక ఈ సినిమా నుంచి తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ కూడా ఇచ్చాడు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను మార్చి 12న సాయంత్రం 5.01 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సినిమాను దర్శకుడు అరుణ్ ప్రభు డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను తమిళ్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



## అందాల సోనాల్ అదిరిపోయింది

తెలుగు తెరపై అందాల వర్షం కురిపించిన సోనాల్ చౌహాన్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందం , అభినయం బాగున్నప్పటికీ ఎందుకో ఈ ముద్దుగుమ్మకు రావాల్సినంత పేరు దక్కలేదు. తెలుగులో అవకాశాలు కూడా ఈ మధ్యకాలంలో రావడం లేదు. దీనికి కారణాలు తెలియరాకపోగా.. ఆమె అభిమానులు మాత్రం నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే సోనాల్ చౌహాన్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఫోటో షూట్ వైరల్ అవుతోంది.16 మే 1985న ఉత్తరప్రదేశ్‌లోని అగ్రాలో ఓ రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించారు సోనాల్ చౌహాన్. నోయిడా, ఢిల్లీలలో చదువుకున్న ఈ ముద్దుగుమ్మ.. 2005లో మలేషియాలో జరిగిన మిస్ వరల్డ్ టూరిజం కాంటెస్ట్‌లో పాల్గొని కిరీటం దక్కించుకున్నారు. ఈ ఘనత సాధించిన తొలి భారత యువతిగా సోనాల్ రికార్డుల్లోకెక్కారు. అనంతరం మోడలింగ్‌లోకి దిగిన ఈ సోనాల్ చౌహాన్.. పలు ప్రముఖ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేశారు. అనంతరం సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ రాజ్‌పుత్ భామ బాలీవుడ్ స్టార్ హిమేష్ రేష్మియా నటించిన ఆప్‌కీ సరూర్ ద్వారా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు.

## సోము వీర్రాజుని వరించిన ఎమ్మెల్సీ



ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును మరోసారి మండలి పదవి వరించింది. అనూహ్యంగా ఆయన పేరును అధిష్ఠానం ప్రకటించింది. నామినేషన్ల దాఖలుకు చివరిరోజైన సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి విజయవాడకు బీ ఫాం పంపింది. దీంతో టీడీపీ కూటమి నేతలతో కలిసి వీర్రాజు నామినేషన్ వేశారు. గతంలో 2014లో కూడా టీడీపీ-బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడే ఆయనకు తొలిసారి మండలి సభ్యత్వం దక్కింది. పదవీ కాలం ముగిశాక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన వీర్రాజు.. 2024 ఎన్నికల్లో రాజమహేంద్రవరం అర్బన్ లేదా రూరల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి ప్రయత్నించారు. అయితే సిటింగ్ స్థానాలను మిత్రపక్షాలకు ఇవ్వలేనని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్పష్టం చేయడంతో ఆయన ఆశలు ఫలించలేదు. తాజాగా ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవడంతో తమ పార్టీకి ఒక సీటు కేటాయించాలని బీజేపీ పెద్దలు కోరారు.

## ఎమ్మెల్సీ పదవిపై స్పందించిన ఎస్వీఎస్ఎన్ వర్మ



‘టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుతో నా ప్రయాణం 23 ఏళ్లు.. ఇన్నేళ్లుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేసుకునే అవకాశం కల్పించారు.. నాకు ఇదే పెద్ద పదవి. ఇంతకంటే ఎక్కువ ఏం ఉంటుంది’ అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఎమ్మెల్సీ పదవి ఆయనకు రాకపోకవడంతో కాకినాడ జిల్లా పిఠాపురంలోని టీడీపీ కార్యాలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివచ్చారు. ఆయన వారితో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా.. లేకున్నా టీడీపీ కుటుంబంతో కలిసి ఎన్నో పోరాటాలు చేశామన్నారు. తాను, తన కుటుంబం, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కుటుంబం ఎల్లప్పుడూ చంద్రబాబు, భవిష్యత్ రథసారథి లోకేశ్ ఆదేశాలు, నిర్ణయాలను శిరసావహిస్తామని తెలిపారు.



# మస్క్‌కు మద్దతుగా కొత్త టెస్లా కారు కొంటున్నా


అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య ఉన్న స్నేహం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ శాఖ సారథిగా మస్క్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ శాఖ సలహాలతో ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా అగ్రరాజ్యంలో మస్క్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల టెస్లాను బహిష్కరించాలంటూ అగ్రరాజ్యంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. ఈనేపథ్యంలోనే ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మస్క్‌కు మద్దతుగా కొత్త టెస్లా కారును కొంటున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.'ఎలాన్‌మస్క్ మన దేశాన్ని గొప్పగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం అతను అద్భుతంగా పనిచేస్తున్నారు. కానీ, రాడికల్ లెఫ్ట్ భావజాలం కలిగిన వ్యక్తులు కావాలనే, కుట్రపూరితంగానే టెస్లాను బహిష్కరించాలని ప్రయత్నిస్తున్నారు. టెస్లా ప్రపంచంలోని గొప్ప ఆటోమేకర్, ఎలాన్ "బేబీ". మస్క్ ఒక గొప్ప అమెరికన్. తనకు మద్దతుగా నేను రేపు సరికొత్త టెస్లాను కొనుగోలు చేయనున్నా. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో సహాయం చేస్తున్న అతన్ని ఎందుకు శిక్షించాలి?' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఇక, ఈ పోస్టుకి మస్క్ స్పందిస్తూ.. అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.


రూ.349 లక్షల కోట్ల సంపద ఆవిరి: అమెరికా మార్కెట్లు గజగజ!

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ వ్యయాలను కట్టడి చేయడం కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీని ఏర్పాటుచేశారు. దీని పగ్గాలను మస్క్‌కు అప్పగించారు. ఈ శాఖ ఇచ్చిన సలహాలతో వేల మంది ఫెడరల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను తొలగించడంతో సహా ఫెడ్ తన వ్యయాల్ని తగ్గించుకొనే ప్రయత్నాలు, సుంకాలు సహా పలు కీలక నిర్ణయాలను ట్రంప్ తీసుకుంటున్నారు. దీంతో మస్క్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీని ప్రభావం మస్క్ కంపెనీ అయిన టెస్లా కార్ల విక్రయాలపై పడింది. టెస్లాను బహిష్కరించాలంటూ పలువురు ఇటీవల నిరసన తెలిపారు. ఈ క్రమంలో మస్క్‌కు మద్దతుగా నిలిచేందుకు ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

## భారత రెజ్లింగ్ సమాఖ్యపై సస్పెన్షన్ ఎత్తివేత

భారత రెజ్లింగ్ సమాఖ్యపై ఉన్న సస్పెన్షన్‌ను మంగళవారం క్రీడా మంత్రిత్వశాఖ ఎత్తివేసింది. దేశీయ టోర్నమెంట్ల నిర్వహణ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జాతీయ జట్ల ఎంపిక నిమిత్తం ఈ నిర్ణయం తీసుకుంది. లైంగిక వేధింపుల ఆరోపణలతో సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫొగాట్ తదితర రెజ్లర్లు పోరాటం చేసిన సంగతి తెలిసిందే. దాంతో కొత్త అధ్యక్షుడి కోసం సమాఖ్యకు ఎన్నికలు నిర్వహించారు. వాటిలో బ్రిజ్‌భూషణ్ నమ్మిన బంటు సంజయ్‌సింగ్ గెలిచాడు. అనంతరం కొత్త పాలకవర్గం అత్యుత్సాహం ప్రకటించింది. డబ్ల్యూఎఫ్ఐ నియమావళికి విరుద్ధంగా అండర్-15, 20 జాతీయ ఛాంపియన్‌షిప్స్ నిర్వహిస్తామని ప్రకటించడం, పాత కార్యవర్గం (పరోక్షంగా బ్రిజ్‌భూషణ్) నియంత్రణలోనే ఇంకా సమాఖ్య ఉండటం లాంటి కారణాలతో 2023 డిసెంబర్ 24న భారత రెజ్లింగ్ సమాఖ్యపై క్రీడాశాఖ సస్పెన్షన్ విధించింది. ఇంతకాలం డబ్ల్యూఎఫ్ఐ రోజువారీ కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీ చూసుకుంది. తాజాగా సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. గడువు లోపు ఎన్నికలు నిర్వహించనందుకు 2023 ఆగస్టు 23న డబ్ల్యూఎఫ్ఐపై యుడబ్ల్యూడబ్ల్యూ(యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఆరు నెలల అనంతరం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.





## రీఎంట్రీకి సిద్ధమైన రంభ

ముప్పై ఏళ్ళ క్రితం ‘ఆ ఒక్కటి అడక్కు’ సినిమాతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది రంభ. తొలి సినిమానే రంభకు తిరుగులేని క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆ తర్వాత సూపర్ కృష్ణ, చిరంజీవి, సల్మాన్ ఖాన్, రజనీకాంత్, విజయ్, తదితర అగ్ర నటులతో నటించింది ఈ భామ. అయితే కొన్నేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్న ఆమె తాజాగా రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. ఈ విషయంపై ప్రముఖ తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్పందించారు. రంభ మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రంభ ఆర్థికంగా ప్రస్తుతం స్థిరంగా ఉన్నారు. ఆమె భర్త కూడా ఒక ప్రముఖ వ్యాపారి. అయితే అతడు కొన్ని రోజుల క్రితం నన్ను కలిసినప్పుడు రంభకు ఒక గొప్ప సినిమా ప్రాజెక్ట్‌లో అవకాశం కల్పించమని కోరారు. అటువంటి అవకాశం దొరికితే ఆమెను తప్పక సంప్రదిస్తానని ఆయనకు హామీ ఇచ్చాను అని తెలిపారు.



## పాకిస్థాన్‌కు ట్రంప్ షాక్

అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి, డొనాల్డ్ ట్రంప్ వలస నియమాలకు సంబంధించి కఠినమైన వైఖరిని అవలంబిస్తున్నారు. ఇంతలో, తుర్క్‌మెనిస్తాన్‌లోని పాకిస్తాన్ రాయబారిని అమెరికాలోకి ప్రవేశించడానికి అనుమతించలేదు. ఏకంగా ఎయిర్‌పోర్టు నుంచే తిరిగి పంపించారు. తుర్క్‌మెనిస్తాన్‌లోని పాకిస్తాన్ రాయబారి కె.కె. అహ్సన్ వాగన్‌ను అమెరికా బహిష్కరించింది.



## ధర్నా చౌక్ వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు


రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఛలో విజయవాడ పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం గాంధీనగర్ ధర్నా చౌక్ వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10వేల మంది అంగన్వాడీలు రానున్న నేపథ్యంలో సీఐ లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగానే పోలీసులు భారీగా చేరుకున్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## దళితులకు అన్యాయం చేసిన ఘనత వైసీపీదే

వైఎస్ జగన్ దళిత ద్రోహి అని శాసనసభలో ఎస్సీ ఎమ్మెల్యేలు విమర్శించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధి కోసం 27 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టగా.. జగన్ ఆ పథకాలన్నింటినీ రద్దు చేసి ఎస్సీల కడుపు కొట్టారని దుయ్యబట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తమ శాఖకు నిధులను అభ్యర్థిస్తూ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన డిమాండ్‌పై చర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి అమలు చేసిన 27 పథకాలకు వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్, జగనన్న పేర్లు పెట్టుకోవడం సిగ్గుచేటని తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని కొండ్రు మురళీమోహన్ విమర్శించారు. దళిత మహిళలపై అత్యాచారాలు, ఘోరాలు, నేరాల్లో ఏపీ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని వీఎం థామస్ ఎద్దేవా చేశారు. ఎస్సీలకు దక్కాల్సిన రూ.33 వేల కోట్లను జగన్ దారి మళ్లించారని బొగ్గుల దస్తగిరి ఆరోపించారు. గిత్తా జయసూర్య, ఎంఎస్ రాజు, అయితాబత్తుల ఆనందరావు, ఆదిమూలం కూడా గత ప్రభుత్వం ఎస్సీలకు చేసిన అన్యాయంపై ధ్వజమెత్తారు. మంత్రి సమాధానమిస్తూ... 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కేంద్ర సహకారంతో వాటిని పునఃప్రారంభిస్తున్నామన్నారు. కాగా.. సొంత ఇళ్లను అద్దెకు ఇస్తున్నవారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చట్టంలో తగు మార్పులు, చేర్పులు చేయనున్నామని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. ఇళ్లలో అద్దెకుంటున్నవారు యజమానులను రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు ప్రస్తావించారు. ఈ సమస్యకు పరిష్కారం చూసుతూ ప్రైవేటు బిల్లు తీసుకొస్తామని తెలిపారు.





## టీమ్ఇండియా విజయోత్సవ ర్యాలీపై రాళ్లదాడి

భారత క్రికెట్ జట్టు 12 ఏండ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకున్నది. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి ముచ్చటగా మూడోసారి 'చాంపియన్స్'గా నిలిచింది. దీంతో దేశవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. పటాకుల మోతలు, విజయోత్సవ ర్యాలీలతో ప్రజలు సంతోషాన్ని పంచుకున్నారు. ఈ క్రమంలో పలుచోట్ల అవాంఛనీయ ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా మోవ్ పట్టణంలో కొందరు యువకులు టీమ్ఇండియా విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని జామా మసీద్ వద్దకు ర్యాలీ చేరుకున్నది. అయితే కొందరు వ్యక్తులు ర్యాలీపై రాళ్లతో దాడిచేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. పరస్పరం రాళ్లతో దాడిచేసుకున్నారు. పలు దుకాణాలను ధ్వంసం చేశారు. వాహనాలకు నిప్పంటించారు. దీంతో ఆ ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నదని ఇండో జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

## టీటీడీ ఉద్యోగి చేతివాటం, సస్పెన్షన్ వేటు

వేంకటేశ్వర స్వామి మీద ఉన్న భక్తితో కొంతమంది భక్తులు టీటీడీకి సంబంధించిన ట్రస్టులకు విరాళాలు భారీగా ఇస్తుంటారు. మరి కొందరు భక్తులు స్వామివారి హుండీల ద్వారా కానుకలను అందజేస్తారు. భక్తులు ఇస్తున్న కానుకలను టీటీడీలో పని చేస్తున్న కొంతమంది ఉద్యోగులు పక్కదారి పట్టిస్తున్నారు. దీంతో టీటీడీకి చెడ్డపేరు వస్తోంది. అయితే తాజాగా చెన్నైలో టీటీడీ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. టీటీడీకి చెందిన ఆలయ పరకామణిలో జరిగిన చోరీ ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. ఏకంగా శ్రీవారి హుండీలోనే దొంగతనానికి సదరు ఉద్యోగి పాల్పడ్డాడు. శ్రీవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల్లో టీటీడీ సీనియర్ ఉద్యోగి కృష్ణకుమార్ చేతివాటం చూపించాడు. విదేశీ కరెన్సీ రూపంలో స్వామివారికి భక్తులు కానుకలు అందజేశారు. ఇందులో సదరు ఉద్యోగి భారీగా అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ కరెన్సీ లెక్కపెడుతుండగా భారీగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. కరెన్సీ లెక్కింపులో భారీగా తేడాలు ఉన్నట్లు ఆలయ అధికారులు గుర్తించారు.ఈ ఘటన బయటకు రావడంతో శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొంగతనానికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావుకు కమిటీ నివేదిక సమర్పించింది. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు కృష్ణకుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను టీటీడీ ఈవో శ్యామలరావు జారీ చేశారు. ఇటీవల శ్రీవారి దర్శన బ్లాక్ టికెట్ల దందా గుట్టురట్టయిన విషయం తెలిసిందే. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు బ్లాక్‌లో అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. టీటీడీ ఆస్తులను భద్రంగా ఉంచాలని శ్రీవారి భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





## కోపం వస్తే ఇప్పటికీ అదేపని చేస్తా!

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చిన్ననాటి ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు మలయాళ మందారం కీర్తి సురేష్. చిన్నప్పటి తన అల్లరి గురించి చెబుతూ 'చిన్నతనంలో బాగా అల్లరి చేసేదాన్ని. మా అమ్మనైతే ఓ రేంజ్‌లో ఆడుకునేదాన్ని. నాకు బాగా గుర్తు. నన్నెవరైనా తిడితే.. వాళ్లు రూమ్‌లో ఉన్నప్పుడు బయట గడి పట్టేసేదాన్ని. ఆ విధంగా మా అమ్మను చాలాసార్లు ఏడిపించా. మీకో విషయం తెలుసా?.. ఇప్పటికీ నాకు కోపం వస్తే అదే పనిచేస్తా.' అంటూ అందంగా నవ్వేసింది కీర్తి సురేష్. ఇంకా చెబుతూ 'నాకు చిన్నప్పుడు రూపాయి కాయిన్స్‌ని నోట్లో పెట్టుకోవడం అలవాటు. అలా రెండుసార్లు కాయిన్స్‌ని మింగేశాను కూడా. ఆ అలవాటు మానడానికి చాలా టైమ్ పట్టింది. నిజంగా నా ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చింది సినిమాలే. సినీ నటిని అయ్యాక, నేను పూర్తిగా మారిపోయా. ముఖ్యంగా 'మహానటి' సినిమా వృత్తిపరంగానే కాదు, వ్యక్తిగతంగా కూడా నాలో చాలా మార్పు తెచ్చింది.' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేష్.

## హబ్సిగూడలో దారుణం.. పిల్లల్ని చంపి దంపతుల ఆత్మహత్య

హైదరాబాద్ హబ్సిగూడలో దారుణం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. పిల్లల్ని చంపి, భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. దంపతులిద్దరూ చెరో గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని సూసైడ్‌కు పాల్పడ్డారు. కుటుంబం బలవన్మరణానికి ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మొకురాల గ్రామానికి చంద్రశేఖర్ రెడ్డి, కవిత దంపతులకు ఇద్దరు పిల్లలు.. వీరంతా హబ్సిగూడలో నివాసముంటున్నారు.. చంద్రశేఖర్ రెడ్డి ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా పనిచేశారు.. అయితే.. ఆరు నెలలుగా ఉద్యోగం లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.. ఈ క్రమంలోనే.. కూతురు శ్రిత, కుమారుడు విశ్వాన్ రెడ్డిని చంపి.. భార్య కవితతో కలిసి సూసైడ్ చేసుకున్నారు చంద్రశేఖర్ రెడ్డి.. కూతురు శ్రితా రెడ్డి 9వ తరగతి, కుమారుడు విశ్వాన్ రెడ్డి ఐదవ తరగతి చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ముందు ఇద్దరు పిల్లలకు విషమిచ్చి.. వారు అపస్మారక స్థితిలో ఉండగా.. గొంతునులిమి చంపి.. తర్వాత ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న లేఖలో ఆర్థిక ఇబ్బందులే కారణమని రాశారు చంద్రశేఖర్. గత నెల 21నే వీరు చనిపోవాలని ఓసారి ప్రయత్నించారు. కానీ.. ఆరోజు తమ ఆలోచనను విరమించుకున్నా.. నిన్న దాన్ని అమలు చేశారు. ముందు పిల్లల్ని చంపి.. మంచంపై పడుకోబెట్టారు. ఆతర్వాత దంపతులు ఇద్దరూ చెరో గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నారు.



వీరి స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మొకురాల గ్రామమని.. లెక్చరర్ వృతి నిమిత్తం చంద్రశేఖర్ రెడ్డి హైదరాబాద్ వచ్చి హబ్సిగూడలో స్థిరపడ్డారని పోలీసులు తెలిపారు. వీరి కుమార్తె శ్రీతారెడ్డి అబిడ్స్ లోని ఫిట్జ్ స్కూల్ లో 9వ తరగతి చదువుతోంది. ఆమె క్లాస్ లో టాపర్‌గా తోటి విద్యార్థులు చెబుతున్నారు. కుమారుడు విశ్వాన్ రెడ్డి కూడా బాగా చదువుతాడని అంటున్నారు. అతడు జాన్సన్ స్కూల్ లో 5th క్లాస్ చదువుతున్నాడు. విషాద వార్తను తెలుసుకున్న చంద్రశేఖర్ రెడ్డి, కవిత కుటుంబ సభ్యులు_ _ _ పరుగు పరుగున హబ్సిగూడకు చేరుకున్నారు. చనిపోయిన నలుగురిని చూసి తట్టుకోలేక గుండెలవిసేలా రోదించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే తాము చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ రాశారని ఏసీపీ రాజేందర్ తెలిపారు. ఇంట్లో రెండు లేఖలు దొరికాయని వివరించారు.. కాగా.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడం హైదరాబాద్ లో కలకలం రేపింది.

## గుడ్ న్యూస్ చెప్పిన చైనా.. గుండెపోటు, స్ట్రోక్‌కు వ్యాక్సిన్

ప్రస్తుత కాలంలో గుండెపోటు, స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయి.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా చాలా మంది మరణిస్తున్నారు.. ఈ తరుణంలో చైనా గుడ్ న్యూస్ చెప్పింది.. రక్తం గడ్డకట్టడం, స్ట్రోక్, గుండెపోటులకు కారణమయ్యే ధమనులలో ఫలకం ఏర్పడకుండా నిరోధించడానికి చైనాలోని శాస్త్రవేత్తలు సంభావ్య వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు.. దీనిని అథెరోస్క్లెరోసిస్ లేదా ధమనులలో కొవ్వు ఫలకం పేరుకుపోవడం అని కూడా అంటారు. వాపు వల్ల ధమనులు గట్టిపడటం రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది.. స్ట్రోక్, అనూరిజం లేదా గుండెపోటుకు దారితీస్తుంది. అథెరోస్క్లెరోసిస్ — ఒక శోథ వ్యాధి — సహజ అడ్డంకులు, ఎంజైమ్‌లతో కూడిన శరీరం.. సహజ రోగనిరోధక శక్తి, అలాగే యాంటీబాడీలతో కూడిన దాని అనుకూల వ్యవస్థల ద్వారా అనుసంధానం చెందుతుందని వైద్యులు అంటున్నారు. ఈ రకమైన ధమనుల అడ్డంకులను గతంలో స్కాన్‌ల ద్వారా నిర్ధారించారు.. కానీ



ఇప్పుడు యాంజియోప్లాస్టీ వంటి శస్త్రచికిత్సా విధానాలతో చికిత్స చేస్తున్నారు.. ఇది రక్త నాళాలు మూసుకుపోకుండా నిరోధించడానికి స్టెంట్లను ఉపయోగిస్తుంది. వైద్యుల ప్రకారం.. అథెరోస్క్లెరోసిస్ అనేది పెద్ద- మధ్యస్థ-పరిమాణ ధమనుల దీర్ఘకాలిక శోథ వ్యాధి.. ఇది ఇస్కీమిక్ గుండె జబ్బులు, స్ట్రోకులు, పెరిఫెరల్ వాస్కులర్ వ్యాధికి కారణమవుతుంది.

## 3 సంవత్సరాల్లో రాజధాని నిర్మిస్తాం

మూడు సంవత్సరాలలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ సభ సాక్షిగా స్పష్టం చేశారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు కొనసాగుతుండగా.. రాజధాని అమరావతి విషయంలో సభ్యులు సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతి పనుల పూర్తికి 64వేల 721 కోట్లతో ఎస్టిమేషన్ వేశామని.. టెండర్లు కొనసాగుతున్నాయని చెప్పారు. 2019-24లో వచ్చిన రాజకీయ అనిశ్చితి వల్ల అమరావతి నిర్మాణంలో ఇబ్బందులు వచ్చాయని చెప్పకొచ్చారు. 2028కి రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్‌లు వేసి ఇస్తామని తెలిపారు. అమరావతి రాజధానిని 2014-19న నిర్ణయించినప్పుడు ఇదే సభలో వైఎస్ జగన్ ఆమోదం తెలిపారని... ప్రభుత్వం మారాక మూడుముక్కలాడారని మండిపడ్డారు. రాజధాని రైతులు ఎంతో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ లేకుండా భూములు ఇచ్చారని.. ఈ ఏడు, ఎనిమిది నెలలు హర్డిల్స్ అన్నీ దాటి టెండర్లను పిలిచామని చెప్పారు. వరల్డ్ బ్యాంకు, ఏడీబీ 13400 కోట్లు మంజూరు చేసిందని.. కెఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రూ.5 వేల కోట్లు ఇచ్చిందని.. అలాగే హడ్కో



రూ.11 వేల కోట్లు ఇస్తోందని తెలిపారు. అంతేకాకుండా రూ.1560 కోట్లు కేంద్రం గ్రాంటు కింద ఇస్తోందని చెప్పకొచ్చారు.రాజధానిని మూడు సంవత్సరాల్లో కంప్లీట్ చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. మెయిర్ రోడ్డులు 2 సంవత్సారాల్లో పూర్తి చేస్తామని.. ఎల్‌పీఎస్ రోడ్లు, డ్రైన్లు మూడు సంవత్సారాల్లో పూర్తి చేస్తామన్నారు. అమరావతి రాజధానికి జగన్ ముందు ఒప్పకొని తరువాత ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. దీంతో అయిదేళ్ల పాటు రైతులు సఫర్ అయ్యారన్నారు. అసెంబ్లీ, హైకోర్టు 3 సంవత్సారాల్లో పూర్తవుతాయని వెల్లడించారు. 136 ఆర్గనైజేషన్లుకు 1277 ఎకరాలు ఇచ్చామని.. గత అయిదేళ్ల పరిణామాల వల్ల కొందరు వెనెక్కి వెళ్లారని తెలిపారు. 31 ఆర్గనైజేషన్‌లకు 629.3 ఎకరాలకు అంగీకారం తెలిపామన్నారు. 13 సంస్థలకు ఇచ్చిన భూములు రద్దు చేశామన్నారు. ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రచ్చర్, రోడ్డు, స్ట్రామ్ వాటర్, వాకింగ్ ట్రాక్స్ వంటి ఫెసిలిటీస్‌తో ఉన్నాయన్నారు. 1280 ఎల్‌పీఎస్ రోడ్లకు టెండర్లు పిలిచామన్నారు. కొండవీటి వాగు, వాగు గ్రావీటీ కెనాల్‌లకు టెండర్లు పిలిచామన్నారు. మొత్తం 73 వర్కులకు రూ.64,721 కోట్లు ఎస్టిమేషన్ వేశామని... వీటిలో 62 పనులను టెండర్లు అయిపోయాయని చెప్పారు. గత ముఖ్యమంత్రి 50 వేల మందికి సెంటు లెక్కన ఇచ్చారన్నారు. ఆర్‌ఫైవ్ జోన్ క్రియేట్ చేశారని... వారికి ఆల్టర్నేట్ స్థలం ఇచ్చి ఆ భూమిని కూడా తీసుకుంటామని మంత్రి నారాయణ సభలో పేర్కొన్నారు.

## హృతిక్ రోషన్‌కి గాయం

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం వార్ 2. ఈ సినిమాలో ఎన్టీఆర్ కీలక పాత్రలో నటిస్తుండగా.. వార్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రానికి అయన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఆదిత్య చోప్రా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా.. మూవీ షూటింగ్‌లో హృతిక్‌కి గాయం అయినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో హృతిక్, ఎన్టీఆర్ మధ్య క్రేజీ డ్యాన్స్ సీక్వెన్స్ ఉండబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. పాట కోసమే ఏకంగా 500 మంది డ్యాన్సర్లను రంగంలోకి దింపారు. అయితే ఈ పాటకోసం ఎన్టీఆర్‌తో కలిసి రిహార్సల్స్ చేస్తుండగా.. హృతిక్ కాలికి గాయం అయ్యింది. ఈ గాయం వలన హృతిక్‌ని డాక్టర్లు నాలుగు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీంతో ఈ డ్యాన్స్ షూట్ మే నెలకి వాయిదా పడింది. యశ్‌రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తుండగా.. జాన్ అబ్రహాం, కియారా అద్వానీ కీలక పాత్రలలో నటిస్తున్నారు.

